క్లుప్తంగా

నేడు పింఛన్ల పంపిణీ

నాదెండ్ల: మండలంలోని 16 సచివాలయాల్లో శనివారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో స్వరూపరాణి చెప్పారు. ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను పంపిణీ చేస్తారన్నారు. మండల పరిధిలో 9339 మంది లబ్ధిదారులకు గాను రూ.4,01,37,500లు పింఛను సొమ్ము పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జూన్ 1వ తేది ఆదివారం కావటంతో ఒక్కరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు.

యడ్లపాడు: ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల కార్యక్రమాన్ని శనివారం నుంచి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో వి.హేమలతాదేవి చెప్పారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు అందజేస్తారని తెలిపారు. ఉదయం 7 గంటలకే పంపిణీ ప్రక్రియ మొదలవుతుందన్నారు. యడ్లపాడు మండలం పరిధిలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ తదితర పెన్షన్లు మొత్తం 7,775 మంది లబ్ధిదారులు ఉన్నారని, వీరికి రూ.3,31,69,000 నగదును ముందురోజైన శుక్రవారం నాడే వివిధ బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసినట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది 31వ తేదీన 99 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

నేడు మున్సిపల్ సమావేశం

వినుకొండ: స్థానిక మున్సిపల్ సమావేశం మందిరంలో శనివారం ఉదయం 11 గంటలకు పురపాలక సంఘం సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ షేక్ దస్తగిరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మున్సిపల్ వైస్ చైర్మన్‌లు, వార్డు మెంబర్లు, ఎక్స్ అఫిషియో మెంబర్లు పాల్గొనాలని సూచించారు.

వైభవంగా బొడ్రాయి వార్షికోత్సవం

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో వేంచేసియున్న నాభిశిల (బొడ్రాయి) 13వ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయానే నాభిశిలను మహిళలు మంచినీటితో శుద్ధిచేసి పసుపు, కుంకుమతో ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు హరిశర్మ ఆధ్వర్యంలో నాభిశిల వద్ద పంచామృత అభిషేకాలు, వాస్తు హోమం, నవగ్రహ పూజలు, నాభిశీతలాంబ విశేష పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పార్టీలకు అతీతంగా అందరు పూజల్లో పాల్గొన్నారు. గ్రామంలో నలువైపులా ఉన్న గమిడిరాళ్ళకు పూజలు చేపట్టారు. నాభిశిలను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. మాజీ సర్పంచ్ బోడెపూడి అంజలీప్రసాదు కుటుంబ సభ్యులు సారథ్యంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ ఛీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, సర్పంచి తన్నీరు భారతి, మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లిఖార్జునరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దుకాణాల వద్దే రేషన్ పంపిణీ

నరసరావుపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ నెల 1వ తేదీ నుంచి రేషన్‌ను చౌకధరల దుకాణం వద్దనే పంపిణీ చేయడం జరుగుతుందని తహసీల్దార్ కె.వేణుగోపాలరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ, మండల పరిధిలోని రేషన్ కార్డుదారులు సమీపంలోని చౌకధరల దుకాణం వద్ద 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిత్యావసర సరుకులు పొందాలని సూచించారు. 65 సంవత్సరాలు పైబడిన, వికలాంగులు, మంచం పట్టిన వ్యక్తులకు 5వ తేదీ లోపు ఇంటి వద్దకు చేరవేస్తారని తెలిపారు.

దర్శకేంద్రుడు దాసరికి నివాళి



వినుకొండ: దర్శకేంద్రుడు దాసరి నారాయణరావు వర్ధంతి సందర్భంగా గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర స్టూడియోలో దాసరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాపీఠం అధ్యక్షుడు గుమ్మడి మాట్లాడుతూ దాసరి దర్శకత్వం వహించిన సినిమాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. సమాజాన్ని మేల్కొలిపే చిత్రాలు అనేకం తీశారన్నారు. కార్యక్రమంలో భీమవరం ఏడుకొండలు, మందేపల్లి లక్ష్మీనరసయ్య, ఎం.వెంకటేశ్వర్లు, దాసరి నాగేశ్వరరావు, ముదికోటి మహేశ్వరరావు, రావిపాటి వీరయ్య, బొంకూరి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

50 శాతం రాయితీపై పశువుల దాణా పంపిణీ

నకరికల్లు: పాడి రైతులను ఆదుకునేందుకు తెల్ల రేషన్ కార్డు కలిగిన పశు పోషకులకు 50 శాతం రాయితీపై పశువుల దాణా పంపిణీ చేయనున్నట్లు వెటర్నరీ ఏడీఏ వెంకటేశ్వర్లునాయక్ శుక్రవారం తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన రైతులందరూ నేరుగా నకరికల్లులోని పశు వైద్యశాలలో సంప్రదించి దాణా తీసుకెళ్లాలన్నారు. రెండు పెద్ద పశువులకు, ఒక దూడకు 90 రోజులకు సరిపడా దాణా సరఫరా చేస్తామన్నారు. రూ.1,100 విలువ గల 450 కేజీల దాణా 50 శాతం రాయితీపై రూ.555కు అందిస్తామన్నారు. మండలంలోని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

- మాజీ మంత్రి విడదల రజిని పిలుపు
- పార్టీ పదవులు పొందిన పలువురికి అభినందనలు



పార్టీ పదవులు పొందిన నాయకులు, కార్యకర్తలతో మాజీ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని చెప్పారు. నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడుగా మద్దూరి శివరామ కోటిరెడ్డి, కార్యదర్శిగా వలేటి వెంకటేశ్వరరావు, అధికార ప్రతినిధిగా ఉడతా వెంకటేశ్వర రావు, రాష్ట్ర ఐటీ విభాగం రీజినల్ కోఆర్డినేటర్‌గా పాలూరి అంజిరెడ్డి నియమితులయ్యారు. జిల్లా పార్టీ కార్యవర్గంలో పదవులు పొందిన వారు శుక్రవారం విడదల రజినిని ఆమె నివాసంలో కలసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని నమ్ముకొని కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ పార్టీ సముచిత స్థానం కల్పించటంతో పాటు వారికి అండగా ఉంటుందని తెలిపారు. జగనన్న పాలన కాలంలో ప్రజలకు జరిగిన మేలు, ప్రజల పట్ల చూపిన ప్రేమ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కరువయ్యాయని వెల్లడించారు. చేసిన మంచి ప్రజల్లో చిరస్థాయిగా నిలచి పోతుందని, ప్రతి పేదవాడికి వైఎస్సార్ సీపీ అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధి ప్రజలు ఎన్నటికీ మరిచిపోయే పరిస్థితి లేదన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను, వైఫల్యాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, తగిన సమయంలో తగిన విధంగా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. రాబోయే రోజుల్లో అందరూ కష్టపడి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుదామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవలో విద్యకే తొలిప్రాధాన్యత

- ఇన్నర్‌వీల్ క్లబ్ చిలకలూరిపేట అధ్యక్షురాలు గట్టు సరోజిని
- రవిశంకర్ ఆశ్రమ పాఠశాల అభివృద్ధికి రూ.10.20 లక్షల చెక్కు అందజేత

యడ్లపాడు: అనాథ బాలల విద్యాభ్యున్నతికి ఇన్నర్‌వీల్ క్లబ్ భారీ విరాళాన్ని అందించింది. యడ్లపాడు మండలం కొత్తపాలెం (పుట్టకోట) గ్రామంలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక గురూజీ రవిశంకర్ ఆశ్రమ పాఠశాల(ఆర్ట్ ఆఫ్ లివింగ్)కు రూ.10.20 చెక్కును శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షురాలు గట్టు సరోజిని మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమాల్లో పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు ఉచిత విద్య, సౌకర్యాలను అందించడంలో ఇన్నర్‌వీల్ తొలిప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇందులో భాగంగానే మద్ది లక్ష్మయ్య గ్రూప్స్ కంపెనీ డైరెక్టర్ మద్ది వెంకటేశ్వరరావు, లలితమ్మ దంపతుల ఆర్థిక సహకారంతో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో రూ.10.20 లక్షల విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ నిధులతో ఆశ్రమ పాఠశాలలో మూడు బ్లాక్‌ల్లో మరుగుదొడ్ల నిర్మాణం, పుస్తకాలు, తాగునీటి సౌకర్యాలు ఇతరేత్ర వాటిని సమకూర్చనున్నట్లు వెల్లడించారు. క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ ప్రేమలత మాట్లాడుతూ ఆధ్యాత్మిక గురూజీ రవిశంకర్ ఆధ్వర్యంలో కొండవీడు కొండల నడుమ పచ్చని ప్రకృతితో అనాథ విద్యార్థుల కోసం ఆశ్రమ పాఠశాల నిర్వహించడం పేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఇక్కడ 180 మంది పిల్లలకు మానవత విలువలతో ఉచిత విద్యను అందిస్తున్నారన్నారు. ఇన్నర్‌వీల్ చిలకలూరిపేట శాఖ ఇంతటి భారీ విరాళాన్ని సేకరించి అందించడం అభినందనీయమన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు భారీ విరాళాన్ని అందించిన క్లబ్ సభ్యుల్ని హెచ్‌ఎం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు గట్టు సరోజిని, దాత మద్ది లలిత, డాక్టర్ గట్టు రంగారావు, ఏసీ చైర్మన్ సభ్యులు కోలా విజయలక్ష్మీ, కార్యదర్శి నార్నె జయలక్ష్మి, పాస్ట్ ప్రెసిడెంట్ టి రమాదేవి, సభ్యులు జాస్తి ప్రమీలా, కె భారతి, ఎం పద్మావతి, జి రత్న, ఆశ్రమ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగించుకోండి



శావల్యాపురం: స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన తరగతులను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని శావల్యాపురం గ్రంథాలయ అధికారి గంగవరపు అర్జున్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 0- 5 నుంచి 15 సంవత్సరాల లోపు వయస్సు కల్గిన చిన్నారులకు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల పుస్తక పఠనం, కథలు చెప్పటం, రాయటం, స్పోకెన్ ఇంగ్లిషు, చిత్రలేఖనం, సంగీతం, నాట్యం, ఉపన్యాసం అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం చిన్నారులకు క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాససింగ్, చెన్నుబాబు, మద్దికుంట ఆంజనేయులు, సనిశెట్టి వెంకట గురు వీరాంజినేయులు, చెవల శ్రీరాములు ఉన్నారు.

గణిత ఉపాధ్యాయుడికి పదోన్నతిపై హర్షం



శ్రీనివాసరాజు

శావల్యాపురం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న కుమ్మరి శ్రీనివాసరాజుకు ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతిపై బొల్లాపల్లి మండలం బండ్లమోటు జెడ్పీ ఉన్నత పాఠశాలకు నియమాకమైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొడ్డపాటి విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గణిత బోధకులు శ్రీనివాసరాజు 24 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో మెరుగైన సేవలు అందించి అందరి మన్ననలు పొందటం ఎందరికో ఆదర్శమన్నారు. పదోన్నతి పొందిన శ్రీనివాసరావు సాక్షితో మాట్లాడుతూ 2001లో డీఎస్సీలో ఎంపికై 2002లో ఈపూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా జాయిన్ అయినట్లు తెలిపారు. తన స్వగ్రామం శావల్యాపురం అని తల్లిదండ్రులు ఆశయ సాధన మేరకు గురువులు నేర్పిన విద్యను అభ్యసించి ప్రాథమిక దశ నుంచి క్రమశిక్షణా పట్టుదల దృఢ సంకల్పం కల్గియుంటే ఏమైనా సాధించవచ్చునన్నారు. అలాగే తాను చదువుకున్న పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించటం జన్మభూమి రుణం తీర్చుకోవటం వంటిదేనన్నారు. పదోన్నతి పొందిన శ్రీనివాసరాజును సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని, ఎంపీటీసీ సభ్యులు దేవనబోయిన పోతురాజు, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఎంఈవోలు మద్దికుంట సాంబశివరావు, పుసులూరి లలితకుమారి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ చారిట్రబుల్ ట్రస్టు చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, ఉపాధ్యాయుల రాగుల రాధాకృష్ణమూర్తి, శ్రీకాంత్, అబ్దుల్లా, నిర్మల, భువనేశ్వరి తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

నేడు విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



నూజెండ్ల: మండలంలోని యోగిరెడ్డిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామ లక్ష్మణ హనుమత్ సమేత రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం నేడు జరగనుంది. గురువారం నుంచి గణపతి పూజా మహోత్సవంతో ప్రారంభమైన కార్యక్రమం శనివారం విఘ్నేశ్వర పూజతో ప్రారంభించి లక్ష్మీగణపతి పూజ పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సుమారు కోటి రూపాయల నిధుల సేకరణతో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు గ్రామ కమిటీ పెద్దలు తెలిపారు. గత రెండు రోజులుగా గ్రామంలో కోలాటాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని గ్రామ పురోహితుడు దేవలపల్లి విశ్వనాథ శాస్త్రి ఆధ్వర్యంలో సహస్రాధిక ప్రతిష్టాపనాచార్యులు సాగి నరసింహమూర్తి ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. నేడు జరగనున్న ప్రతిష్టా మహోత్సవానికి భక్తులందరూ పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించాలని కమిటీ కోరారు.

5న లూథరన్ దేవాలయ పునః ప్రతిష్ట



నూతనంగా నిర్మించిన చర్చి

నాదెండ్ల: స్థానిక చైతన్యనగర్ కాలనీ (పెద్ద ఎస్సీ కాలనీ)లో సుమారు రూ.1.50 కోట్లలో పునర్నిర్మించిన ఎపిఫానియా లూథరన్ దేవాలయం జూన్ 5వ తేదీన ప్రతిష్ట మహోత్సవం నిర్వహించనున్నట్లు చర్చి ఫాదర్ బి.మోహనరావు తెలిపారు. 1955లో నిర్మించిన చర్చి శిథిలావస్థకు చేరటంతో గ్రామస్తులు, దాతల సహకారంతో 2020 మే నెలలో పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. సుమారు రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మాణం పూర్తి చేశామన్నారు. జూన్ 5వ తేదీ ఉదయం 10 గంటలకు పునః ప్రతిష్ట కార్యక్రమం జరగనుంది. 4న మందసం ఊరేగింపు, 5 ఉదయం ప్రతిష్ట, సాయంత్రం కోలాట ప్రదర్శన జరుగుతుందన్నారు.

కార్యక్రమానికి ఏఈఎల్‌సీ కంట్రోలర్, మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కురియన్‌జోసఫ్, ఏఈఎల్‌సీ అడ్మినిస్ట్రేటర్ జోసఫ్, సెక్రటరీ జేసు రత్నకుమార్, జీఎస్టీ రిటైర్డ్ సూపరింటెండెంట్ బి.రాజేశ్వరరావు, విశ్రాంత డీఎస్‌వో జాన్‌వెస్లీ, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, మాజీ మంత్రి విడదల రజిని, అధికారులు, నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు.

గజానికో గుంత - తీరేనా చింత!

- గోతులమయంగా నూజెండ్ల ప్రధాన రహదారి
- గోంతలు కనిపించక వాహనదారులకు ఇక్కట్లు



రహదారి దుస్థితి ఇదీ!

నూజెండ్ల: వినుకొండ నుంచి మండల కేంద్రమైన నూజెండ్లకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. నిత్యం మండలానికి రాకపోకలు సాగించే ప్రజలతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు అధ్వాన రహదారితో ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద వాహనాల పరిస్థితి మరింత కష్టతరంగా మారింది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోతుల పరిమాణం పెరిగి వాహనచోదకులు ప్రయాణం క్లిష్టంగా మారింది. రాత్రి వేళల్లో దగ్గరకు వచ్చే వరకూ గుంతలు కన్పించక పోవటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల పాత ఉప్పలపాడు నుంచి గురప్పనాయుడుపాలెం వరకూ తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా అక్కడ మరలా రహదారిపై గోతులు తేలాయి. నూజెండ్ల సమీపంలో 2 కిలోమీటర్ల ఆర్ అండ్ బీ రోడ్డు మరింత దారుణంగా మారింది. ఇంత వరకూ నైనా పూర్తిస్థాయి రహదారి నిర్మాణం చేపడితేనే సమస్య పరిష్కారమవుతుందని వాహనదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జేఎన్‌టీయూఎన్‌లో ముగిసిన ఎంఎస్ ఆఫీస్‌పై శిక్షణ



నరసరావుపేట రూరల్: కాకాని జేఎన్‌టీయూఎన్ ఇంజనీరింగ్ కళాశాల క్యాంపస్‌లో నిర్వహించిన ఎంఎస్ ఆఫీస్ హ్యాండ్స్ ఆన్ శిక్షణా కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈనెల 19వ తేదీ నుంచి 30వ తేదీ వరకు బోధనా, బోధనేతర సిబ్బందికి ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 40మంది సిబ్బంది శిక్షణలో పాల్గొని అనుభవాత్మకంగా నేర్చుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్.శ్రీనివాసరావు పాల్గొని సిబ్బందికి సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ సంచాలకులు డాక్టర్ జీపీ రాజు, శిక్షకులు ఎస్‌వీ రమణారావులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం





నాదెండ్ల: అంబులెన్సులో గురువారం అర్ధరాత్రి గర్భిణి శిశువుకు జన్మనిచ్చిన సంఘటన ఎండుగుంపాలెం గ్రామంలో చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు ఎన్ఎస్‌పీ కాలువ కట్టపై నివశించే ఎండేటి భద్రయ్య భార్య అడివెమ్మ నిండు గర్భిణి. గురువారం అర్ధరాత్రి సమయంలో పురిటి నొప్పులు రావటంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి 108 అంబులెన్సు చేరుకుని గర్భిణిని వాహనంలో ఎక్కించుకుని నరసరావుపేట ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 సిబ్బంది పురుడు పోశారు. మొదటి కాన్పులో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. తల్లిబిడ్డ క్షేమ సమాచారం తెలుసుకున్న 108 మేనేజర్ సుబ్బారావు ఆశవర్కర్ బిందు, ఈఎంటీ శోభన్‌బాబు, పైలెట్ షేక్ అల్లాబక్షు అభినందించారు.

బాలికా విద్యకు అధిక ప్రాధాన్యం



యానాది కాలనీ వాసులకు వ్యవసాయ పనిముట్లు అందిస్తున్న చీఫ్‌విప్ జీవీ

నూజెండ్ల: బాలికల విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తూ వారికి మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక శాసనసభ్యులు, చీఫ్‌విప్ జి.వి.ఆంజనేయులు అన్నారు. మండలంలో నూజెండ్ల కస్తూరిబా పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన, కమ్మవారిపాలెం యనాది సంఘంలో 15 లక్షలతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ జి.వి.ఆంజనేయులు మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదుల నిర్మాణంతో బాలికలకు మరింత మెరుగైన వసతులు సమకూరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. యానాది కాలనీలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విడుదల చేస్తున్న నిధులతో కాలనీలో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లిఖార్జునరావు, తహసీల్దార్ రమేష్ బాబు, ఎంపీడీవో ఉమాదేవి, లగడపాటి వెంకట్రావు, గంగినేని ఆంజనేయులు, గంగినేని బాబు, జడ్డా రామయ్య తదితరులు ఉన్నారు.

భూసార పరీక్ష ఫలితాలు త్వరగా అందజేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఏవో మురళి

నరసరావుపేట రూరల్: భూసార పరీక్ష ఫలితాలను రైతులకు త్వరగా అందజేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ తెలిపారు. వ్యవసాయ మార్కెట్ యార్డులోని భూసార పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. భూసార పరీక్ష కేంద్రంలో జరుగుతున్న వివిధ పోషకాల విశ్లేషణ, పీహెచ్, ఈసీ సూక్ష్మపోషకాల స్థాయిని పరిశీలించారు. వ్యవసాయ పనులకు రైతులు సమాయత్తమవుతున్నారని, భూసార పరీక్ష ఫలితాల్లో ఆలస్యం జరగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌ను పరిశీలించారు. విత్తనాలు ఎరువుల సంబంధించిన రిజిస్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ మస్తానమ్మ, ఏవో నరేంద్రబాబు, భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారి జి.వరలక్ష్మి, ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్. రాంబాబు



చిలకలూరిపేటటౌన్: పౌర్ణమి సందర్భంగా జరిగే ప్రసిద్ధ అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్రకు ఆర్టీసీ చిలకలూరిపేట డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఎస్. రాంబాబు తెలిపారు. యాత్రికుల కోసం 36 సీట్లు కలిగిన సూపర్ లగ్జరీ పుష్ బ్యాక్ బస్సులో రెండు రోజులు యాత్రను కొనసాగించవచ్చన్నారు. జూన్ 9వ తేదీ రాత్రి 10 గంటలకు చిలకలూరిపేట నుంచి ప్రారంభమై, జూన్ 10న శ్రీకాళహస్తి, కాణిపాకం, అలివేలు మంగాపురం, గోల్డెన్ టెంపుల్ దర్శనాలు కల్పించనున్నారు. అనంతరం జూన్ 11న అరుణాచల గిరి ప్రదక్షణతో పాటు అరుణాచలేశ్వర స్వామి దర్శనం జరగనుంది. జూన్ 12 ఉదయం భక్తులను తిరిగి చిలకలూరిపేటకు సురక్షితంగా తీసుకురావడం జరుగుతుంది. ఒక్కో భక్తునికి రూ.2500 గా ప్యాకేజీ నిర్ణయించబడిందని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆన్లైన్ రిజర్వేషన్ సదుపాయాన్ని కూడా కల్పించామని యాత్రకు వచ్చేవారు తమ సీటును ముందుగానే రిజర్వు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 99592 25427, 6303325113, 7382893037 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

10న వడ్డెర సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్ష పదవికి ఎన్నిక



వడ్డే ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

వినుకొండ: నియోజకవర్గం వడ్డే ఓబన్న వడ్డెర సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్ష ఎన్నికలు ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు సంఘ పెద్దలు తెలిపారు. స్థానిక నరసరావుపేట రోడ్డులోని వడ్డే ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి వారు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బండారు శ్రీనివాసరావు, చల్లా కుమార్ పోటీ పడనున్నారు. అధ్యక్ష ఎన్నిక తరువాత ఐదు మండలాలు, టౌన్ అధ్యక్షులను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పల్లపు వెంకటేశ్వర్లు, బత్తుల నరసింహారావు, దేవళ్ల ప్రసాద్, బత్తుల బాలరాజు, మాజీ కౌన్సిలర్ కుంచాల నాగరాజు, పల్లపు పున్నయ్య, బత్తుల శ్రీనివాసరావు, బత్తుల బాలరాజు, బండారు శ్రీనివాసరావు, బత్తుల వెంకట్రావు, తమ్మిశెట్టి వెంకటస్వామి, బత్తుల సాంబశ్రీను, తురక ఏడుకొండలు, వేముల గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో యోగా భాగం కావాలి

యోగాంధ్రలో పరిశ్రమల శాఖ ఉద్యోగులు, మిల్లర్లు ఆసనాల నిర్వహణ



యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు

నరసరావుపేట: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెద్దచెరువు యోగా స్ట్రీట్‌లో జిల్లా పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాలో ఆ శాఖకు చెందిన ఉద్యోగులు, స్థానిక రైస్, డాల్, ఆయిల్ మిల్లు నిర్వాహకులు యోగా ఆసనాలు వేశారు. యోగాను జీవితంలో భాగంగా చేసుకున్నవారు ఆరోగ్యంగా ఆనందంగా ఉంటారని ఈసందర్భంగా మాట్లాడిన జిల్లా పరిశ్రమల శాఖ అధికారి సుధాకర్, ఏడీ నవీన్‌కుమార్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆచరిస్తే ఆరోగ్యమే మహాభాగ్యమనే నానుడిని యోగా సాకారం చేస్తుందన్నారు. ఇనస్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.రాంబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.